క్లుప్తంగా

ఘనంగా సిద్ధి బుద్ధి కల్యాణం



సిద్ధి బుద్ధి కల్యాణం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పార్వతీపురంటౌన్: గణేశ ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో మెయిన్ రోడ్ బాలాజీ థియేటర్ పక్కన ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో సోమవారం గణేష్ యూత్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర, సిద్ధిబుద్ధిల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పురోహితులు వేమకోటి ఉమాకాంత్ శర్మ వేద మంత్రాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వినాయకుడిని ప్రతిష్టిస్తూ పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కల్యాణంలో పలువురు దంపతులు, కమిటీ సభ్యులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు క్రీడా పోటీలు

సీతంపేట: స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడలు బాలురుకు మాత్రమే మంగళవారం నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు హాజరు కావాలన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమ పూజలు



బిల్లుమడ కాలనీ గణపతి మండపంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలంలోని బిల్లుమడ కాలనీ, బత్తిలి కాలనీ, ఘనసర, కీసర, కోమలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సోమవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల్లో స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. నేరడి-బి లో యువత నృత్యాల నడుమ వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్‌లు ఓ ప్రకటనలో సోమవారం డిమాండ్ చేశారు. పీవో, ఏవో, మేనేజర్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా పోస్టుల్లో అధికారులు లేకపోవడంతో గిరిజన సమస్యలు చాలావరకు పరిష్కారం కావడం లేదని, దీంతో ఐటీడీఏ పరిధిలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఆర్థిక సాయం..



సంజీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు

భామిని: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లోపింటి సంజీవ్ (45) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రూ. పది వేలు సమీకరించి బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గుణద గ్రామంలో బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ ఎం.టి నిర్మలా దేవి, ఎల్‌వన్ ఢిల్లేశ్వరరావు, ఎల్‌టు పరశురాంలు ప్రయోగపూర్వకంగా బ్రహ్మాస్త్రం తయారు చేసి, దాని వినియోగం, ప్రయోజనాలను వివరించారు. సహజ సిద్ధంగా లభించే వనరులతో తయారు చేసుకునే ఈ బ్రహ్మాస్త్రం ద్రావణాన్ని వరి, పత్తి, కూరగాయల పంటలపై పిచికారీ చేస్తే కాండంతొలుచు పురుగుతో పాటు వివిధ తెగుళ్లు, చీడపీడలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీహరి, శైలజ, వెంకటేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

సైబర్ వలకు చిక్కితే విలవిల

- బ్యాంకుల పేరుతో సరికొత్తగా మోసాలు
- ఓటీపీలు, లింకులు పంపుతూ మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లు
- ఎప్పటికప్పుడు విస్తృతంగా అవగాహన
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్న పోలీసు అధికారులు



చినగుడబ వల్లరిగుడబ గ్రామాల్లో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

పార్వతీపురం టౌన్:

- మేం ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం. మీ బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అయింది. ఇప్పుడు మీ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ చెబితే వెంటనే యాక్టివేట్ చేస్తాం.
- 'లక్కీ డ్రాలో మీరు ఐఫోన్ గెల్చుకున్నారు. రూ. 2 వేలు పంపిస్తే రూ. 40 వేల విలువైన ఐఫోన్ మీ సొంతం'
- 'కేవైసీ వివరాలు అప్‌డేట్ చేయాల్సి ఉంది. మీ బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పండి'

ఇలాంటి కాల్స్ ఎప్పుడో ఒకప్పుడు అందరూ అందుకున్న వారే. పొరపాటున ఆ కాల్స్‌కు ప్రతిస్పందించి వారు అడిగిన వాటికి సమాధానాలు చెప్పామో? మన బ్యాంకు ఖాతా ఖాళీ అయిపోయినట్లే. ఇంట్లో కంప్యూటర్ ముందు కూర్చుని షర్టు నలగకుండా చేసే ఇలాంటి సైబర్ నేరాలు ఇటీవల బాగా పెరిగిపోయాయి. నేరగాళ్ల ఉచ్చులోపడి సామాన్యులే కాదు, పెద్దపెద్ద చదువులు చదువుకున్న వారు కూడా మోసపోయి చేతులు కాల్చుకున్న సందర్భాలు అనేకం. ఉచితంగా వస్తుందనో, చవగ్గా లభిస్తుందనో. ఇలా ఏదో ఒక కారణంతో మోసగాళ్ల వలలో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. వారి మాయమాటలకు బలైపోతున్నారు. పోలీసులు ఎంతగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితం ఉండడం లేదు. సైబర్ నేరగాళ్లకు కఠిన శిక్షలు పడుతున్నా నేరాలు ఆగడం లేదు. దేశంలో ఎక్కడో ఓ మారుమూల ప్రదేశంలో ఉండి ఎంచక్కా నేరాలకు పాల్పడుతూ పోలీసులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. చివరికీ ఈ నేరగాళ్ల లోన్ యాప్‌లు, మ్యాట్రిమోనీ సైట్లను కూడా వదలడం లేదు. పెళ్లి పేరుతో వలవేసి లక్షలు కాజేస్తున్నారు. అధికారుల పేర్లు చెప్పి కూడా నేరాలకు పాల్పడుతున్నారు.

'ఇలా చేస్తే సేఫ్

ఎవరు ఎక్కడి నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెప్పినా ఓటీపీ, పిన్ నంబర్లు ఎప్పుడూ, ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదు. ఎవరైనా అలా అడిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. బ్యాంకులు ఎప్పుడూ తమ ఖాతాదారుల రహస్య సమాచారాన్ని అడగవు. కాబట్టి బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెబితే వెంటనే అప్రమత్తం కావాలి. అలాగే, ఆఫర్ల పేరుతో ఎస్సెమ్మెస్‌ల ద్వారా వచ్చే తెలియని లింకును ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. పొరపాటున వాటిపై క్లిక్ చేస్తే మన ఫోన్‌లోని సమస్త సమాచారం సైబర్ నేరగాళ్లకు చేరుతుంది. ఆ తర్వాత బ్యాంకులోని సొమ్ము ఖాళీ అవుతుంది. ఏదైనా సంస్థ నుంచి కానీ, ఇంకెక్కడి నుంచి అయినా సమాచారం కావాలనిపిస్తే అధికారిక వెబ్‌సైట్‌లను మాత్రమే సంప్రదించాలి.

జిల్లాలో ఇప్పటివరకు 18 కేసులు నమోదు

పార్వతీపురం మన్యం జిల్లాలో 2023వ సంవత్సరంలో 17 సైబర్ కేసులు నమోదయ్యాయి. 2014లో ఇప్పటివరకు 1 మొత్తం 18 కేసులు అధికారికంగా నమోదయ్యాయి. కొంతమంది బాధితులు పోలీసులకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం జిల్లా పోలీసు యంత్రాంగం గ్రహించి జిల్లావ్యాప్తంగా బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, కళాశాలలు, కమ్యూనిటీ భవనాలలో సైబర్ నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు గురైతే తీసుకోవాల్సిన చర్యలపై ఎప్పటి కప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930 నంబర్‌కు గాని సమీప పోలీస్‌స్టేషన్‌లో గాని సమాచారం అందించే విధంగా చర్యలు చేపట్టారు.



మామిడివల్లి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్త విధానాల్లో మోసాలు



సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త విధానాలతో మోసాలకు పాల్పడుతున్నారు. ఇటీవల భామిని మండలంలో సైబర్ నేరాల బారిన పడి డబ్బు పోగొట్టుకున్న బాధితులకు రికవరీ చేసి అందజేశాం. గ్రామాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. అనుకోకుండా బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు పోతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేస్తే సంబంధిత అకౌంట్లను ఫ్రీజ్ చేస్తారు. పోలీసులకు ఆశ్రయించాలి. అనవసర యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవద్దు. వాట్సాప్ నంబర్లకు వచ్చే మెసేజ్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వచ్చే అనవసర లింకులను ఓపెన్ చేయవద్దు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– ఎస్‌వీ మాధవరెడ్డి,
ఎస్పీ పార్వతీపురం మన్యం

యోగాసనాలతోనే దీర్ఘకాలిక రుగ్మతల నివారణ



డాక్టర్ టి హేమాక్షి

సీతానగరం: ఆయుర్వేద వైద్య సేవలతోపాటు యోగాసనాలు మానసిక రుగ్మతల నివారణకు దోహద పడతాయని బూర్జ ఆయుర్వేద ఆస్పత్రి ఆయుష్ హెల్త్-వెల్‌నెస్ సెంటర్ డాక్టర్ టి. హేమాక్షి అన్నారు. ఈ మేరకు సోమవారం బూర్జ ఆయుష్ హెల్త్-వెల్‌నెస్ కేంద్రంలో యోగా శిక్షకురాలుగా పనిచేస్తున్న ఎం.రూపవతి రాష్ట్ర స్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో మూడవ స్థానం కైవసం చేసుకున్న సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమాక్షి మాట్లాడుతూ బూర్జ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో రెండు సంవత్సరాల క్రితం ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ కేంద్రం ప్రారంభమైందని, యోగా శిక్షకురాలుగా రూపవతి నియామకం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ హేమాక్షితో సహా సర్పంచ్ జి. దాసు, ఎంపీటీసీ జి.చిన్నంనాయుడు, మాజీ సర్పంచ్ ఎం. చిన్నంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ టి.సూరపునాయుడు, గ్రామస్తులు రూపవతికి అభినందనలు తెలియజేశారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పాచిపెంట: ఏజెన్సీ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, నిరంతర పర్యవేక్షణ చేస్తుండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.జగన్ మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు పాచిపెంట మండలంలోని నీలంవలస, రాయిగుడ్డివలస, జీఎన్‌పేట సీహెచ్‌సీలను డీపీఎం రఘుకుమార్‌తో కలిసి సోమవారం ఆయన సందర్శించారు. గ్రామాల్లో చేపడుతున్న వైద్యశిబిరాలు, సీజనల్‌వ్యాధులపై సర్వే తదితర అంశాలపై ఈ సందర్భంగా ఆయన ఆరా తీశారు. రహదారి సౌకర్యం లేని గ్రామాల్లో ఉండే గిరిజన గర్భిణులను గిరిశిఖర గర్భిణుల వసతి గృహాల్లో ప్రసవానికి ముందుగానే చేర్చాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలతో మాట్లాడి వైద్యారోగ్యసిబ్బంది చేపడుతున్న కార్యక్రమాల గురించి అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యారోగ్యశాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎగ్ ఎమినో యాసిడ్ తయారీ



మిర్తివలసలో బయో ఇన్‌పుట్ సెంటర్ వద్ద తయారు చేస్తున్న యాసిడ్

బలిజిపేట: మండలంలోని మిర్తివలసలో బయో ఇన్‌పుట్ సెంటర్ వద్ద ఎంసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావుల ఆధ్వర్యంలో 50 లీటర్ల ఎగ్ ఎమినో యాసిడ్‌ను సోమవారం తయారు చేశా రు. ఇందుకు గాను 20డజన్ల కోడిగుడ్లు, 30 లీటర్ల నిమ్మరసం, 12కిలోల బెల్లం వినియోగించినట్లు ఎంసీఆర్‌పీ లక్ష్మి తెలిపారు. ముందుగా కోడిగుడ్లను పరిశుభ్రంగా ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములో పేర్చి గుడ్లు మునిగే వరకు నిమ్మరసాన్ని పోసి రెండువారాలు మూతపెట్టి, ప్రతి రోజూ ఒకసారి మూతను తెరుస్తూ ఉంచాలి. బెల్లాన్ని మిగిలిన నిమ్మరసంతో మురగపెట్టా లని ఆమె తెలిపారు. 15 రోజుల తరువాత కోడిగుడ్లు పూర్తిగా కరిగిపోతాయని, తయారుచేసిన రెండు మిశ్రమాలను బాగా కలిపి మూత పెడుతూ రోజుకు ఒకసారి తెరిచి చూడాలన్నా రు. తయారీ మొదలు పెట్టిన నాటి నుంచి నాలుగు వారాల తర్వాత ఎగ్ ఎమినో యాసిడ్ పరిపూర్ణంగా తయారవుతుందని వివరించారు. దీనిని కాయగూరలు, పండ్ల తోటలు, వేరుశనగ, మినుము, మిరప మొదలగు పంటల్లో ఉపయోగించవచ్చని తెలియజేశారు. దీనిని గ్రోత్ బూస్టరుగాను నాణ్యమైన పూత కోసం, పూత నిలబడడానికి, కాయ పెరుగుదలకు వివిధ దశల్లో వాడవచ్చని తెలిపారు. దీని వాడకం వల్ల చెట్లకు కావాల్సిన పోషకాలు, ప్రొటీన్స్ లభ్యమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

వైద్య ఒప్పంద కార్మికులపై వేధింపులు తగవు



జిల్లా ఆస్పత్రి వద్ద వైద్య విభాగ ఒప్పంద కార్మికుల నిరసన

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్

పార్వతీపురంటౌన్: జిల్లాలో వైద్య విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని కార్మికులపై వేధింపులు ఆపాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్‌వీఎస్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా ఆస్పత్రి వైద్య విభాగ ఒప్పంద కార్మికుల అధ్వర్యంలో కార్మికులంతా నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కార్మికులకు కాంట్రాక్టర్లు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, వేతనాలు ఎప్పుడిస్తారని అడిగితే బిల్లులు రాలేదని, అందుకే ఇవ్వలేదని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ ఒప్పంద కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణం ప్రభుత్వం స్పందించి ఒప్పంద కార్మికులకు సంబంధించి కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించి, యూనిఫాం ఇవ్వాలని కోరారు.

పెరిగిన రాజకీయ వేధింపులు

ప్రభుత్వం మారిన తరుణంలో కొన్నిచోట్ల ఒప్పంద కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని ఆరోపించారు. త్వరలో ఉద్యమం ఉధృతం చేస్తున్నామని అందులో భాగంగా కలెక్టర్, జిల్లా వైద్య శాఖ అధికారి, జిల్లా కార్మికశాఖ అధికారి, ప్రజా ప్రతినిధులకు సమ్మె నోటీసులు యిచ్చి సమ్మెకు దిగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దుర్గారావు, కుమారమ్మ , చంద్రమౌళి, కావ్య, శంకర్రావు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం

భామిని: మండలంలోని బత్తిలి కోటదుర్గ (పోలీస్ దుర్గ) సన్నిధిలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు బత్తిలి ఎస్సై డి. అనిల్‌కుమార్‌కు నిర్వాహకులు సోమవారం ఆహ్వానం పలికారు. ఈ మేరకు తాంబూలం అందజేశారు. ఉత్సవాలు వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, గురుస్వామి భవానీ రామశంకర్, తదితరులున్నారు.


ఏచూరి మరణం తీరని లోటు..



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల నాయకుడు దావాల రమణరావు అన్నారు. మండలంలోని సిరికొండలో సోమవారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం ఏచూరి పని చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాద రాము, దూసి దుర్గారావు, ఎస్. గంగయ్య, పాల్గొన్నారు.

మాపై కనికరం లేదా..!



ఏరియా ఆస్పత్రి వద్ద నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

పాలకొండ రూరల్: కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన తమపై కనికరం లేదా అని కాంట్రాక్ట్ నర్సులు అన్నారు. కష్టకాలంలో విధులు నిర్వహించిన తమను పక్కనబెట్టి ఇటీవల విధుల్లోకి వచ్చిన ఏఎన్ఎంలు, జీఎన్ఎంలను రెగ్యులర్ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద కాంట్రాక్ట్ నర్సులు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తాము అందించిన సేవలను పరిగణనలోకి తీసుకుని రెగ్యులర్ చేయాలని కోరారు.

రక్తదాన శిబిరం రేపు

సీతంపేట: మండల కేంద్రంలోని వైటీసీ వద్ద బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కేంద్ర ప్రభుత్వం, నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మేము సైతం రక్తదాన శిబిరంలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా



సీఐ హరికి మొక్క అందజేసి, శుభాకాంక్షలు తెలియజేస్తున్న సర్పంచ్‌లు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో శాంతిభద్రతలకు కృషి చేస్తానని సీఐ బి.హరి అన్నారు. మండల పరిధిలోని ఎల్విన్‌పేట సర్కిల్ కార్యాలయంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొత్తాడ శంకరరావు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే ఆయన సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా గ్రామపెద్దలే చూసుకోవాలని, ఏవైనా చిన్నచిన్న తగాదాలు ఉంటే తమ వద్దకు రాకుండా గ్రామాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్‌లో సైబర్ నేరాలు-వాటి బారినపడకుండా పాటించాల్సి జాగ్రత్తలపై పోలీసులు సోమవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ పి.రమేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు రోజు రోజుకూ ఎక్కువైపోతున్నాయని, స్మార్ట్‌ఫోన్‌లకు వచ్చే అనవసర మెసేజీలు, లింక్‌లకు స్పందించవద్దని సూచించారు. మన ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దన్నారు. బ్యాంకు ఖాతాదారులు, స్మార్ట్‌ఫోన్‌లు ఉన్న వారంతా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మాయగాళ్ల బారినపడకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శంకర్, అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.

గీతా సారాంశం తెలుసుకో..



ప్రచారంలో ఇందూ విజ్ఞాన వేదిక ప్రతినిధులు

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ గీతా సారాంశం తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఇందిరానగర్ కాలనీలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణుడి గీతా సారాంశంతో కూడిన పుస్తకాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో ఇందూ విజ్ఞాన వేదిక శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు గోపాలకృష్ణ, రామకృష్ణ, వెంకటరావు, దుర్గారావు, లక్ష్మి, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.3 లక్షల విరాళం



ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి నగదు అందజేస్తున్న కూటమి నాయకులు

గుమ్మలక్ష్మీపురం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కొమరాడ మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు రూ.3 లక్షల విరాళం ప్రకటించారు. అనంతరం నగదును గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని సోమవారం కలిసి అందజేశారు. ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో కొమరాడ మండల టీడీపీ, జనసేన నాయకులు శేఖర్‌పాత్రుడు, వెంకటనాయుడు, గౌరీశంకర్, అనంత్, ఉపేంద్ర, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రగిరికి ఐటీడీఏ తరలించాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ఐటీడీఏని మండలంలోని భద్రగిరి ఏజెన్సీ ప్రాంతానికి తరలించాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణ మూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వైటీసీ కార్యాలయంలో భద్రగిరిలో ఐటీడీఏ సాధనకై సదస్సు పేరిట ఆదివాసీ సంఘాలు, ప్రజాప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏ ఆదివాసీ ప్రాంతంలోనే ఉండాలన్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఐటీడీఏను భద్రగిరికి మార్చాలని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.